# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**పత్రికా ప్రకటన**

**ఏప్రిల్ 13, 2011**

## వ్యవస్థీకృతమైన అవినీతిని అంతం చేయడానికి ప్రజాపోరాటాల్ని తీవ్రతరం చెయ్యండి!

ఇటీవల 2జి స్పెక్ట్రమ్, కామన్‌వెల్త్ గేమ్స్, ఆదర్శ్ హౌజింగ్ సొసైటీ, కర్నాటక భూముల కుంభకోణం, ఎస్-బ్యాండ్ స్పెక్ట్రమ్ తదితర భారీ కుంభకోణాలు వెలుగులోకి రావడంతో అవినీతి అనే అంశం ఒక ముఖ్య సమస్యగా ముందుకొచ్చింది. కార్మికులు, కర్షకులు, ఆదివాసులు, దళితులు, మహిళలు, ముఖ్యంగా పట్టణ మధ్య తరగతి వగైరా అన్ని వర్గాల, అన్ని సెక్షన్ల ప్రజలు అవినీతికి వ్యతిరేకంగా తమ ఆగ్రహావేశాల్ని ప్రకటిస్తున్నారు. ప్రజల్లో అవినీతి పట్ల, అవినీతికర రాజకీయ పార్టీల పట్ల, వాటి నాయకుల పట్ల గూడుకట్టుకున్న అసంతృప్తి ఫలితమే ఇటీవల అన్నా హజారే చేసిన నిరాహార దీక్షకు దేశవ్యాప్తంగా ప్రజల నుండి వచ్చిన భారీ స్పందన. నిరాహారదీక్షకు సంబంధించిన డిమాండ్ జన్ లోక్‌పాల్ బిల్లు అయినప్పటికీ దేశం నలుమూలల నుండి  స్పందించిన ప్రజల ఆకాంక్ష మాత్రం అవినీతిని పూర్తిగా అంతం చెయ్యాలనే.

లోక్‌పాల్ బిల్లు రూపొందించడం కోసం ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసి అందులో సగం మందిని పౌర సమాజం నుండి ఎంపిక చెయ్యడంతోనే ఈ సమస్యకు పరిష్కారం అయినట్టు లేదా అవుతుందని ఎవరు భావించినా అది అమాయకత్వమే అవుతుంది. నిజానికి ఇప్పటి దాకా అవినీతి ఊడలు దిగిపోయి అంతు లేకుండా పెరిగిపోతున్నది ఎలాంటి చట్టాలూ, నియమాలూ లేకపోవడం వల్ల కాదు. చట్టాలెన్ని వున్నా వాటిని అమలు చేసే, చేయించే వ్యవస్థనే దోపిడీ వర్గాల చేతుల్లో వుండడం వల్ల ఈ దుస్థితి దాపురించింది. ఒకనాటి జీపు కుంభకోణం, లాక్‌హీడ్ విమానాల కొనుగోలు కుంభకోణం నుండి మొదలై రాజీవ్ కాలం నాటి బోఫోర్స్ వగైరా ఎన్నెన్నో కుంభకోణాల చరిత్ర మన దేశానికి వుంది. పదుల కోట్ల రూపాయలతో మొదలై ఈరోజు లక్షల కోట్ల రూపాయల వరకు ఇవి చేరుకున్నాయి. కాంగ్రెస్, బిజెపి వంటి ప్రధాన పార్లమెంటరీ పార్టీలతో పాటు ఆర్‌జెడి, బీఎస్‌పీ, ఎస్‌పీ, డీఎంకే, ఏఐడీఎంకే, తెలుగుదేశం తదితర అన్ని జాతీయ/ప్రాంతీయ పార్లమెంటరీ పార్టీలకు చెందిన నాయకులు, మంత్రులు, వాళ్లకు తొత్తులుగా పని చేసే అధికార్లందరూ అవినీతిలో కూరుకుపోయిన చరిత్ర గలవాళ్లే. దేశంలో ఇప్పటికే అమలులో వున్న చట్టాలను సరిగా అమలు చేయడం ద్వారా, వివిధ అవినీతి నిరోధక శాఖలను సరిగా పని చేయించడం ద్వారా ఇలాంటి అవినీతి కుంభకోణాల్ని అరికట్టవచ్చు. వాటికి బాధ్యులైన వాళ్లను కఠినంగా శిక్షించవచ్చు. కానీ గత 64 సంవత్సరాల 'స్వతంత్ర' భారత చరిత్రలో అవినీతిపరులైన రాజకీయ నాయకులకు, మంత్రులకు, కార్పొరేట్ సంస్థల యజమానులకు, బ్యూరాక్రట్లకు శిక్షలు పడిన వుదాహరణ ఒక్కటైనా కానరాదు. ప్రజల, ప్రతిపక్షాల వత్తిడి వల్ల అరుదైన సంఘటనల్లో ఎవరినైనా అరెస్టు చేసినా ఏళ్ల తరబడి సాగే విచారణ తర్వాత కేసుల్ని నిర్వీర్యపర్చి శిక్షలేమీ లేకుండా లేదా తూతూ మంత్రంగా శిక్షలు వేసి వదిలెయ్యడం సాధారణం. ఎందుకంటే దేశ న్యాయవ్యవస్థ కూడా ప్రస్తుత దోపిడీ రాజ్యవ్యవస్థలో విడదీయరాని భాగమే కనుక. చట్టాల ద్వారా, న్యాయస్థానాల ద్వారా అవినీతి అంతమవుతుందని ఆశించడం ఎండమావుల్లో నీరు దొరుకుతుందని ఆశించడమే.

అవినీతి అనేది కొందరు చెడ్డవాళ్ల లేదా దురాశాపరుల ఆచరణకు సంబంధించిన సమస్య కాదనేది మొదట గుర్తించాల్సిన విషయం. లాభార్జనే ఏకైక మంత్రంగా నడిచే పెట్టుబడిదారీ వ్యవస్థ వికృత ఫలితమే అవినీతి-కుంభకోణాలు. పైకి ఇది ప్రజాస్వామ్యం అని ముసుగేసుకొని స్వేచ్ఛ, సమానత్వం వంటి విలువల్ని వల్లె వేస్తుంది కానీ వాస్తవంలో ఇది దుర్భర శ్రమ దోపిడీ, లంచగొండితనం, కమిషన్లు దిగమింగడం వంటి అక్రమాలతో నిండి వుంటుంది. కాబట్టి అవినీతి, అక్రమాలు సమూలంగా అంతం కావడమనేది ఈ వ్యవస్థ మార్పుతో ముడివడి వున్న అంశం. మనదేశంలో అమలులో వున్న అర్ధవలస - అర్ధభూస్వామ్య వ్యవస్థను యదాతథంగా వుంచి, కొన్ని మెరుగైన చట్టాల్ని తీసుకొచ్చి ఈ సమస్యను పూర్తిగా పరిష్కారం చేయగలమనుకుంటే అది కేవలం భ్రమే అవుతుంది.

నిజానికి కుంభకోణాలుగా వెలుగులోకి వచ్చిన వాటికంటే ఏ మాత్రం బైటికి రాకుండానే వుండిపోతున్నవే ఎన్నో రెట్లు ఎక్కువ. వుదాహరణకు మరణించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి రమన్‌సింగ్, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, ఝార్ఖండ్ ముఖ్యమంత్రులు మధు కోడా, శిబూ సొరేన్, అర్జున్ ముండాలు, కర్నాటక ముఖ్యమంత్రి యదియూరప్ప ఇంకా మరెందరో ఎన్నో మైనింగ్ ఒప్పందాల్లో కమిషన్లు దిగమింగి, ఎన్నో బడా కంపెనీలతో రహస్యంగా ఎంవోయూలు చేసుకొని కమిషన్లు మింగి వేల కోట్ల రూపాయలు అక్రమంగా ఆర్జించిన విషయం పత్రికలు సైతం రాస్తున్నాయి. ప్రభుత్వాలు అమలు చేస్తున్న వుదారీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలే ఇలాంటి ఎన్నో అవినీతి, కుంభకోణాలకు, దేశ సంపదల్ని అడ్డగోలుగా కొల్లగొట్టడానికి ద్వారాలు తెరిచిపెట్టాయి. కాబట్టి ఈ సామ్రాజ్యవాద అనుకూల, ప్రజా వ్యతిరేక ప్రభుత్వ విధానాల్ని నిర్ద్వంద్వంగా వ్యతిరేకించకుండానే, వాటికి వ్యతిరేకంగా పోరాటాల్ని ఎక్కుపెట్టకుండానే అవినీతి రూపుమాసిపోవాలని కోరుకోవడం, మాట్లాడడం ప్రజల్ని పక్కదారి పట్టించడమే అవుతుంది.

ప్రభుత్వం లోక్‌పాల్ బిల్లుకు వుమ్మడి కమిటీ ఏర్పాటు ప్రకటన చేయగానే అన్నా హజారే తన దీక్షను విరమించినప్పటికీ ఈ దీక్షకు మద్దతుగా దేశవ్యాప్తంగా ముందుకొచ్చిన ప్రజాస్పందనకు మాత్రం దీనితో న్యాయం జరగలేదు. నిజానికి ప్రభుత్వం ఈ డిమాండ్‌ను ఒప్పుకున్నది అన్నా దీక్షకు భయపడి కాదు, ఆయనకు మద్దతుగా వెలువడిన ప్రజాగ్రహాన్ని చల్లార్చడం కోసమే. అంతకన్నా ముఖ్యంగా, ఇలాంటి చట్టాలెన్ని చేసినా ప్రస్తుత వ్యవస్థకు కలిగే నష్టమేమీ లేదు కనుకనే పాలకవర్గాలు ఇందుకు నిర్భయంగానే సంసిద్ధత ప్రకటించాయన్నది గమనార్హం.

**అవినీతికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా వెల్లువెత్తిన ప్రజాస్పందనకు భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్రకమిటీ స్వాగతం పలుకుతున్నది. అవినీతి వ్యతిరేక పోరాటానికి మా పార్టీ పూర్తిగా మద్దతు తెలుపుతున్నది. ప్రజల సమైక్య, సంఘటిత, సమరశీల పోరాటాల ద్వారానే అవినీతిని అంతం చెయ్యడం సాధ్యమవుతుందని మా పార్టీ విశ్వసిస్తున్నది. ప్రభుత్వం కంటితుడుపుగా ప్రకటించే చట్టాలతో, చట్టాల రూపకల్పనకు ఏర్పాటు చేసే కమిటీల నియామకంతో సంతృప్తిపడి ఈ పోరాటాలు ఆగిపోకూడదని, పట్టు విడవకుండా కొనసాగాలని మా పార్టీ దేశ ప్రజలందరినీ కోరుతున్నది. కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, మేధావులు, వుద్యోగులు, ప్రజా సంక్షేమాన్ని కోరుకునే గాంధీవాదులతో సహా దేశభక్తియుత సెక్షన్లందరూ మన దేశాన్ని క్యాన్సర్‌లా పట్టి పీడిస్తున్న అవినీతికి వ్యతిరేకంగా విశాల ఐక్య సంఘటనను ఏర్పర్చి వీధుల్లోకి రావల్సిందిగా మా పార్టీ పిలుపునిస్తున్నది. అంతులేని అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ, దేశ ప్రజల మూలుగుల్ని పీల్చుతూ లక్షల కోట్ల రూపాయల నల్ల ధనాన్ని స్విస్ బ్యాంకుల్లో దాచుకుంటున్న బందిపోట్లకూ, గజదొంగలకూ ఒక్క నిమిషం కూడా అధికారంలో కొనసాగే అర్హత లేదని గొంతెత్తి నినదించాలని మా పార్టీ విజ్ఞప్తి చేస్తున్నది.**

Abhay

**(అభయ్)**
**అధికార ప్రతినిధి**
**కేంద్ర కమిటీ**
**సీపీఐ (మావోయిస్టు)**